సాక్షి
ఆదిలాబాద్
శుక్రవారం ı 11 ı ఆగస్టు ı 2023



'గృహలక్ష్మి'కి దరఖాస్తుల వెల్లువ

'గృహలక్ష్మి'కి దరఖాస్తు గడువు గురువారం ముగియగా చివరిరోజు దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. దరఖాస్తుదారులతో తహసీల్ కార్యాలయాలు కిటకిటలాడాయి. 9లో▸

రిమ్స్‌కు 38 వైద్య పోస్టులు

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆస్పత్రికి 38 వైద్యుల పోస్టులు మంజూరు చేస్తూ బుధవారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ కేటగిరీల పోస్టులు మంజూరైనట్లు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు. 38 పోస్టుల్లో 22 రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి, 16 రిమ్స్ జనరల్ ఆస్పత్రికి మంజూరైనట్లు పేర్కొన్నారు.

గరిష్టం/కనిష్టం
32.0/25.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. జిల్లాలో పలుచోట్ల జల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

గ్రూప్–2 పరీక్ష వాయిదా వేయాలని వినతి



అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవికి వినతిపత్రం ఇస్తున్న గ్రూప్–2 అభ్యర్థులు

కైలాస్‌నగర్: టీఎస్‌పీఎస్సీ ద్వారా నిర్వహించనున్న గ్రూప్–2 పరీక్షను వాయిదా వేయాలని అభ్యర్థులు డిమాండ్ చేశారు. గురువారం అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవిని కలెక్టరేట్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సిలబస్‌లో మార్పులు, నూతన అంశాలు అదనంగా పొందుపరచడంతో ప్రిపరేషన్‌కు సమయం సరిపోదని తెలిపారు. మరో రెండునెలల పాటు పరీక్ష వాయిదా వేయాలని వారు కోరారు.

ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి



సర్టిఫికెట్ ఇస్తున్న సంక్షేమాధికారి మిల్కా


ఆదిలాబాద్‌టౌన్: నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి మిల్కా సూచించారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని సాయివైకుంఠ ట్రస్ట్‌లో నిర్వహించిన శిక్షణ తరగతులను పరిశీలించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధికల్పన శాఖ, ప్రొడక్టివిటి కౌన్సిల్ ద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు.

16న జిల్లాస్థాయి ఖోఖో ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: ఈనెల 16న జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఖోఖో ఎంపిక పోటీలను జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సీహెచ్ కాంతారావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అండర్–17 విభాగంలో బాలబాలికలకు పోటీలుంటాయని తెలిపారు. అర్హులైన క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రం, బోనఫైడ్ సర్టిఫికెట్‌తో పోటీల ఆర్గనైజర్ ప్రతాప్‌సింగ్‌కు ఉదయం 10గంటలకు రిపోర్ట్ చేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పాఠశాలల విద్యార్థులు అర్హులని తెలిపారు. ఒక్కో పాఠశాల నుంచి ఇద్దరు చొప్పున బాలబాలికలను తీసుకురావాలని సూచించారు.

ముగిసిన 'గృహలక్ష్మి' దరఖాస్తుల స్వీకరణ

కైలాస్‌నగర్: 'గృహలక్ష్మి' దరఖాస్తుల స్వీకరణ గడువు గురువారం ముగిసింది. కలెక్టరేట్, ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయంతో పాటు అన్ని మండలాల తహసీల్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయగా దరఖాస్తుదారులు బారులు తీరారు. అన్నిచోట్ల కుప్పలు, తెప్పలుగా దరఖాస్తులు వచ్చాయి. చివరిరోజు సుమారు 20వేలకు పైగానే దరఖాస్తులు వచ్చినట్లు అధికారుల అంచనా. శుక్రవారం పూర్తి స్పష్టత వచ్చే అవకాశముందని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు మూడు రోజులే గడువు విధించగా దరఖాస్తుదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇది నిరంతర ప్రక్రియ అని ప్రభుత్వం ప్రకటించినా కౌంటర్లు మూసివేయనుండడంతో దరఖాస్తుల స్వీకరణ కొనసాగిస్తారా.. లేదా.. అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



గతేడాది ఇంటింటా ఇన్నోవేటర్‌లో ఆవిష్కరణలకు ఎంపికైనవారితో అధికారులు

ఆవిష్కరణలకు ఆహ్వానం

- నైపుణ్యాన్ని వెలికితీసేందుకే జిల్లాలో 'ఇంటింటా ఇన్నోవేటర్'
- ఈనెల 12వరకు దరఖాస్తు గడువు
- భావిశాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకే..
- స్వాతంత్య్ర దినోత్సవాన ప్రదర్శన

ఆదిలాబాద్‌టౌన్: నూతన ఆవిష్కరణలకు ప్రభుత్వం ఆహ్వానం పలుకుతోంది. వివిధ రంగాలకు చెందిన వ్యక్తుల్లోని నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. విద్యార్థులు, యువత, రైతులు, విద్యావేత్తలు, వ్యాపారులు.. ఇలా ఎవరైనా వయస్సుతో సంబంధం లేకుండా ప్రదర్శనలు తయారు చేయవచ్చు. అందరికీ ఉపయోగపడేలా ఉన్న ఆవిష్కరణలను ఎంపిక చేసి స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా కేంద్రంలోని పరేడ్ మైదానంలో ప్రదర్శన కోసం ఉంచుతారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రదర్శనలుగా ఎంపికైన వాటిని రాష్ట్రస్థాయికి పంపుతారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంసాపత్రంతో పాటు నగదు బహుమతులు అందజేస్తారు. ఇదివరకు జిల్లాలో ఇద్దరు రాష్ట్రస్థాయిలో బహుమతులు పొందడం గమనార్హం. ఒకరికి రూ.5లక్షల నగదు అందజేయగా, మరొకరికి టీ–హబ్‌లో ఉద్యోగం కల్పించారు.

గతేడాది తయారు చేసిన పరికరాలు

గతేడాది జిల్లాలో పలువురు ప్రజలకు ఉపయోగపడే పరికరాలు తయారు చేశారు. కేంద్రీయ విద్యాలయంలో చదివే శ్లోక్ అనే విద్యార్థి వికలాంగులకు ఉపయోగపడే సాఫ్ట్‌వేర్ తయారు చేశాడు. అలాగే జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో టెక్నికల్ ఏవోగా పనిచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి విత్తనాలు నాటే ట్రాక్టర్ నమూనాను తయారు చేశారు. నితిన్ అనే వ్యక్తి ఆదిలాబాద్ యాప్, రవికిరణ్ అనే వ్యక్తి రోబో సాఫ్ట్‌వేర్, భీంపూర్ మండలానికి చెందిన వినోద్‌రెడ్డి యూరియా చల్లే పరికరాన్ని తయారు చేశారు. వీరితో పాటు పలువురు మరికొన్ని ఆవిష్కరణలు రూపొందించి అధికారులు, ప్రజాప్రతినిధుల మన్ననలు పొందారు.

నూతన ఆవిష్కరణలకు శ్రీకారం

నిత్య జీవితంలో ప్రజలు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం, వినూత్న రీతిలో ప్రదర్శనలు తయారు చేయడం, వ్యర్థాలతో ఉపయోగపడే విధంగా ప్రాజెక్టులు రూపొందించడం.. ఇలా నూతన ఆవిష్కరణలు తయారు చేసేందుకు ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. అధికారులు ఏటా దరఖాస్తులు స్వీకరించి ఉత్తమ ఆవిష్కరణలను ఎంపిక చేసి పంద్రాగస్టు రోజు ప్రదర్శనలు తిలకించేలా స్టాళ్లలో అందుబాటులో ఉంచుతారు. వీటిలో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి పంపుతారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన వారికి ప్రభుత్వం రూ.5లక్షల నగదుతో పాటు ప్రశంసాపత్రాలు అందజేస్తుంది. ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం ప్రతీ ఒక్కరిలోని ప్రతిభను వెలికితీసేందుకు దోహదం చేస్తోంది. తయారు చేసిన ప్రాజెక్టులకు సంబంధించిన ఫొటోలను 9100678543 నంబర్‌కు వాట్సాప్ చేయాల్సి ఉంటుంది. తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ నుంచి జిల్లా స్థాయికి ఎంపికైన వాటిని సంబంధిత అధికారులకు పంపిస్తారు. ఏవైన సందేహాలుంటే జిల్లా సైన్స్ అధికారి రఘురమణను 9440060288 నంబర్‌లో సంప్రదించవచ్చు.

ప్రతిభను వెలికితీసేందుకే..



ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంలో ఎవరైనా పాల్గొనవచ్చు. మేధావులు, విద్యార్థులు, మహిళలు, మెకానిక్‌లు ఇలా అన్ని రంగాలవారు ఆవిష్కరణలు తయారు చేయవచ్చు. ఈనెల 12వరకు దరఖాస్తు గడువు ఉంది. గతంలో జిల్లా నుంచి ఇద్దరు రాష్ట్రస్థాయి అవార్డులు పొందారు. వారికి నగదు పారితోషికం ప్రభుత్వం అందజేసింది. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ప్రభుత్వ గుర్తింపు లభిస్తుంది. తయారు చేసిన ప్రదర్శనలను ఈనెల 15న జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో ప్రదర్శిస్తాం. – **రఘురమణ, జిల్లా సైన్స్ అధికారి**

గైనకాలజిస్ట్‌లపై కలెక్టర్ ఆగ్రహం

సాక్షి ఎఫెక్ట్..



వైద్యులతో మాట్లాడుతున్న జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆస్పత్రిలోని గైనిక్ వైద్యులపై కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 7న 'సాక్షి' దినపత్రికలో 'పురిటి కష్టాలు' శీర్షికన ప్రచురించిన కథనానికి ఆయన స్పందించారు. విధులు విస్మరించే వైద్యులపై కఠినంగా వ్యవహరించాలని గురువారం రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌ను ఆదేశించారు. దీంతో డైరెక్టర్ గైనిక్ విభాగంలో పనిచేసే వైద్యులతో సమావేశం నిర్వహించారు. సమయపాలన పాటించాలని, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన సేవలందించాలని సూచించారు. రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్, గైనిక్ విభాగం హెచ్‌వోడీ పద్మిని, గైనకాలజిస్ట్‌లు కౌస్తుబా, క్రాంతి, రాజ్యలక్ష్మి, కవిత, స్వేచ్ఛ, సంయుక్తారెడ్డి, దీప, సంగీత, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

'రూ.లక్ష సాయానికి డబ్బులడగొద్దు'



లబ్ధిదారుకు చెక్కు ఇస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

కైలాస్‌నగర్: బీసీ కులవృత్తుల వారికి ఇస్తున్న రూ.లక్ష సాయానికి ఎవరూ డబ్బులడగొద్దని ఎమ్మెల్యే జోగు రామన్న సూచించారు. పలుచోట్ల లబ్ధిదారుల నుంచి కొందరు సర్పంచులు, కౌన్సిలర్లు రూ.10వేల నుంచి రూ.20వేల వరకు డబ్బులు అడుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశం మందిరంలో గురువారం బీసీ కులవృత్తులవారికి రూ.లక్ష సాయం చెక్కులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తొలి విడత నియోజకవర్గంలో 300మందికి చెక్కులు అందజేసినట్లు తెలిపారు. బీసీ ప్రధానిగా చెప్పుకొనే ప్రధాని నరేంద్రమోదీ బీసీలకు చేసిందేమీ లేదని ఆరోపించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జిల్లా బీసీ సంక్షేమాధికారి రాజలింగు, మున్సిపల్ కమిషనర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి

కైలాస్‌నగర్: దేశభక్తిని చాటేలా స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. శాఖలవారీగా కేటాయించిన విధులు నిర్వహించడానికి అధికారులు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసేలా ఇంటింటికీ జెండాలు పంపిణీ చేయాలని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలును తెలిపేలా స్టాళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. దేశభక్తి, సంస్కృతి, సంప్రదాయాలు తెలియజేసేలా పాటలు ఎంపిక చేసి విద్యార్థులతో నృత్య ప్రదర్శనలు నిర్వహించాలని తెలిపారు. ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేయనున్నందున శాఖలవారీగా ఒకరిని మాత్రమే ఎంపిక చేసి వివరాలు అందజేయాలని సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఆర్డీవో స్రవంతి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, విద్యుత్‌శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్, డీపీవో శ్రీనివాస్, డీఈవో ప్రణీత, ఆర్డీవో పీ శ్రీనివాస్, డీపీఆర్వో విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు, తపస్ నాయకులు

కైలాస్‌నగర్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని తపస్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సునీల్‌చౌహాన్ మాట్లాడారు. పాఠశాలల్లో స్కావెంజర్స్‌ను నియమించకపోవడంతో పరిశుభ్రత లోపిస్తోందని తెలిపారు. సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. నాయకులు గంద్రత్ నారాయణ, వలబోజు గోపీకృష్ణ, నారాయణ, మనోజ్‌రెడ్డి, అంబాజీ, గంగాధర్ తదితరులున్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు వీడాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న విలాస్

కైలాస్‌నగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు వీడాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ డిమాండ్ చేశారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశాన్ని కాపాడుకుందామనే నినాదంతో కేంద్ర కార్మిక సంఘాలు 'మహాపడావ్' పేరిట రెండురోజుల ధర్నాకు పిలుపునిచ్చాయి. ఇందులో భాగంగా గురువారం కుమ్రంభీం చౌరస్తాలో మానవహారంగా ఏర్పడి అనంతరం కలెక్టరేట్ ఎదుట నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా విలాస్ మాట్లాడారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం రద్దు చేయడంతో కార్మికులు బానిసలుగా మారారని తెలిపారు. వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సిర్రా దేవేందర్, సునీత తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన అంధ్ సమాజ్ నాయకులు



గవర్నర్‌కు చిత్రపటం ఇస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: ఆదివాసీ అంధ్ సమాజ్ సేవా సంఘం నాయకులు గురువారం హైదరాబాద్‌లోని హరిహర కళాభవనంలో నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలకు హాజరైన గవర్నర్ తమిళిసై సౌందర్యరాజన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అంధ్ ఆదివాసీ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, చదువు, ఉపాధి, ఉద్యోగాల విషయంలో అంధ్ ఆదివాసీలు వెనుకబడి ఉన్నారని తెలిపారు. పోటీ పరీక్షల్లో రాణించలేక పోతున్నారని పేర్కొన్నారు. గురుకులాలు, ఏకలవ్య పాఠశాలల్లో అంధ్ ఆదివాసీ విద్యార్థులకు ప్రత్యేకంగా సీట్లు కేటాయించాలని కోరారు. కాగా, సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించిన గవర్నర్ రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. గవర్నర్‌ను కలిసినవారిలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుడే కైలాస్, నాయకులు కేశవ్, ముఖడే విష్ణు, డాక్రే సుభాష్ తదితరులున్నారు.

ప్రసవాల సంఖ్య పెరగాలి

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా వైద్యాధికారులు చర్యలు చేపట్టాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్ రాథోడ్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఇమ్యునైజేషన్ వందశాతం పూర్తి చేయాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని, పల్లె దవాఖానాల్లో విధులు నిర్వహించే వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. విధులు విస్మరించే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని సూచించారు. ఎనీమియాపై ప్రత్యేక దృష్టి సారించాలని, టీ హబ్‌లో నిర్వహిస్తున్న పరీక్షల గురించి ప్రచారం చేయాలని తెలిపారు. ఆస్పత్రి భవన నిర్మాణాలు త్వరగా పూర్తిచేయించాలని సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, వైద్యాధికారి విజయసారథి ఉన్నారు.

జేపీఎస్‌ల క్రమబద్ధీకరణ షురూ



జేపీఎస్‌కు ఉత్తర్వు అందజేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యే జోగు రామన్న

- 12మందికి ఉత్తర్వులు అందజేత

కైలాస్‌నగర్: జిల్లాలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. నాలుగేళ్ల ప్రొబేషనరీ కాలాన్ని పూర్తి చేసుకున్న జేపీఎస్‌లను వారి పనితీరు ప్రామాణికంగా రెగ్యులరైజ్ చేస్తున్నారు. గ్రామంలో పచ్చదనం, పరిశుభ్రత, మంచినీరు, రోడ్లు, పల్లె ప్రగతి పనుల అభివృద్ధి, పనితీరు లాంటి అంశాలపై స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ ఖుష్బూ గుప్తా పంచాయతీల వారీగా ప్రత్యేక పరిశీలన చేపడుతున్నారు. ఇందులో 70 శాతానికి పైగా మార్కులు సాధించిన వారిని రెగ్యులరైజ్ చేస్తున్నారు. జిల్లాలో 323 మంది పంచాయతీ కార్యదర్శులు పనిచేస్తుండగా ఇప్పటివరకు 24మంది జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేసేందుకు అర్హులుగా నిర్ధారించారు. అందులో 12 మందిని రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తిస్తూ కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యే జోగు రామన్న చేతుల మీదుగా గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉత్తర్వులు అందజేశారు. మిగతావారికి త్వరలోనే సర్వే పూర్తిచేసి శాశ్వత ఉద్యోగులుగా ఉత్తర్వులు అందిస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఆర్డీవో స్రవంతి, డీపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

భయాందోళనలో డోంగర్‌గామ్ ఆదివాసీలు




చూపు కోల్పోయిన దేవ్‌రావ్, బాదు పటేల్

ఇంద్రవెల్లి: పదిరోజుల వ్యవధిలో మండలంలోని డోంగర్‌గామ్ గ్రామపెద్దలు మడావి దేవ్‌రావ్, గ్రామపటేల్ పెందోర్ బాదుపటేల్ కంటిచూపు పోగా గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. 10రోజుల క్రితం గ్రామానికి చెందిన మడావి దేవ్‌రావ్ కంటిచూపు కోల్పోయాడు. అతడి కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా కేంద్రంలోని ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించినా చూపు రాలేదు. నాలుగు రోజుల క్రితం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లి ఆపరేషన్ చేయించినా ఫలితం లేకపోయింది. బుధవారం రాత్రి ఉన్నట్టుండి గ్రామపెద్ద, గ్రామపేటల్ పెందోర్ బాదుపటేల్ కంటిచూపు పోయింది. పదిరోజుల వ్యవధిలో ఇద్దరు గ్రామపెద్దల చూపు పోవడంతో గ్రామ ఆదివాసీలు భయాందోళనకు గురవుతున్నారు. కాగా, 40రోజుల క్రితం ఓ ప్రజాప్రతినిధి డోంగర్‌గామ్ గ్రామాన్ని సందర్శించాడు. గ్రామ పొలిమేరలోని హనుమాన్ విగ్రహానికి బంగారు కళ్లు చేయిస్తానని అప్పటికే ఉన్న వెండికళ్లు తీసుకువెళ్లాడు. బంగారు కళ్లు చేయిస్తానన్న సదరు ప్రజాప్రతినిధి జాప్యం చేయడంతోనే గ్రామపెద్దలు వరుసగా చూపు కోల్పోతున్నారని గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు దృష్టి సారించి కంటిచూపు కోల్పోతున్న వారిని పరీక్షించి చూపు వచ్చేలా చూడాలని కోరుతున్నారు.

వీఆర్‌ఏల సర్దుబాటు ప్రక్రియ పూర్తి

- నియామక, పోస్టింగ్ పత్రాల పంపిణీ
- కేటాయించిన శాఖల్లో విధుల్లో చేరిక
- హైకోర్టు తీర్పుతో ఆందోళన



పోస్టింగ్ ఆర్డర్లు తీసుకుంటున్న వీఆర్‌ఏలు

కైలాస్‌నగర్: వీఆర్‌ఏల సర్దుబాటు ప్రక్రియ గురువారం ముగిసింది. స్థానిక టీఎన్జీవోస్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాలో పనిచేస్తున్న 302 మంది, నిర్మల్, నిజామాబాద్ నుంచి కేటాయించబడ్డ మరో 25 మంది కలిపి 327 మందికి శాఖలవారీగా పోస్టింగ్ ఇచ్చారు. నియమాకపత్రాలు, పోస్టింగ్ ఆర్డర్లు అందజేశారు. తొలుత జిల్లా ఇన్‌చార్జి మంత్రి, కలెక్టర్ చేతుల మీదుగా అందజేస్తామని ప్రకటించగా వీఆర్‌ఏల సర్దుబాటుపై హైకోర్టు స్టే విధించడంతో వారు హాజరు కాలేదు. అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, ఇన్‌చార్జి డీఆర్వో అరవింద్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రక్రియ కొనసాగింది. పోస్టింగ్ ఆర్డర్లు అందించేందుకు మండలాల వారీగా 18 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. నియమాక పత్రాలు అందుకున్న వీఆర్‌ఏలు ఆ శాఖల్లో అప్పటికప్పుడు విధుల్లో చేరేలా 18మంది జిల్లాస్థాయి అధికారులతో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. నియమాకపత్రాలు అందుకున్న వీఆర్‌ఏలు తమకు కేటాయించిన శాఖల అధికారులకు రిపోర్టు చేసి వెంటనే విధుల్లో చేరారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన వీఆర్‌ఏలు, వారి కుటుంబీకులతో సందడి నెలకొంది. పోస్టింగ్ ఆర్డర్లు అందుకుని ఆయా శాఖల్లో విధుల్లో చేరిన వీఆర్‌ఏల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి. హైకోర్టు తీర్పు నేపథ్యంలో తాము కొత్త పోస్టుల్లో విధులు నిర్వహించాలా.. లేక వీఆర్‌ఏలుగానే కొనసాగాలా.. అనేదానిపై స్పష్టత లేక వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది.

క్లుప్తంగా

కాలం చెల్లిన కల్యాణలక్ష్మి చెక్కు


కాలం చెల్లిన చెక్కు

నర్సాపూర్(జి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కల్యాణ లక్ష్మి పథకం అధికారుల నిర్లక్ష్యంతో అభాసు పాలవుతోంది. మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన కల్యాణలక్ష్మి లబ్ధిదారురాలికి గురువారం చెక్కు అందజేశారు. చెక్కుపై 6వ తేదీ 4వ నెల 2023 సంవత్సరం ఉంది. లబ్ధిదారురాలు గమనించక ఆ చెక్కును తీసుకొని బ్యాంకుకు వెళ్లగా చెక్కు గడువు ముగిసిందని బ్యాంకు అధికారులు తిరస్కరించారు. దీంతో చేసేదేమీ లేక ఇంటికి వెనుదిరిగారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కొత్త చెక్కు మంజూరు చేయాలని కోరారు.

ద్విచక్ర వాహనం చోరీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని విద్యానగర్‌లో ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. టూటౌన్ సీఐ అశోక్ వివరాల ప్రకారం.. ఈ నెల 8న ఆ కాలనీకి చెందిన జైస్వాల్ చంద్రప్రకాష్ రాత్రి సమయంలో ఇంటి ఎదుట బైక్ పార్కింగ్ చేశాడు. ఉదయం చూసే సరికి వాహనం కనిపించకుండా పోయింది. చుట్టుపక్కల గాలించినా వాహనం ఆచూకీ లేకపోవడంతో గురువారం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

పెట్రోల్‌లో నీళ్లు


పెట్రోల్ బాటిల్‌లో నీటిని చూపుతున్న వినియోగదారుడు సుభాష్

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ పెట్రోల్‌బంక్‌లో పెట్రోల్‌లో నీరు వస్తుందని కుభీర్ మండలంలోని చాత గ్రామానికి చెందిన వినియోగదారుడు సుభాష్ గురువారం ఆందోళన వ్యక్తం చేశాడు. రెండు రోజుల క్రితం వానల్‌పాడ్ పెట్రోల్‌బంక్‌లోకి వెళ్లి పెట్రోల్ పోయించుకున్నానని, వాహనం మొరాయించడంతో మెకానిక్ వద్దకు వెళ్లగా పెట్రోల్‌లో నీరు ఉందని గుర్తించాడని తెలిపాడు. వెంటనే మరోసారి పెట్రోల్ బంక్‌కు వెళ్లి బాటిల్‌లో పెట్రోల్ పోయించుకున్నానని, అందులోనూ నీరుందని గుర్తించి సిబ్బందిని ప్రశ్నించగా తమకేమీ సంబంధం లేదని తెలిపారని, దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పాడు. ఈ విషయమై పెట్రోల్ బంక్ మేనేజర్‌ను వివరణ కోరగా ఇథనాల్ శాతం ఎక్కువగా ఉండడంతో ఇలాంటి పరిస్థితి ఏర్పడుతుందని సమాధానమిచ్చాడు.

దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ జిల్లాలోని వైద్య ఆరోగ్య శాఖ పరిధి లోని జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్రీయ బాల స్వస్థ పథకంలో భాగంగా ఒప్పంద ప్రాతిపదికన మొబైల్ హెల్త్ టీం పురుషుల విభాగంలో రెండు, మహిళల విభాగంలో రెండు పోస్టులకు, ఆయుష్ ఫార్మాసిస్ట్ విభాగంలో ఒక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో ధనరాజ్ తెలిపారు. డీఫార్మసీ, బీఫార్మసీ అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. nirmal.telangana.gov.in నుంచి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని, అర్హత పత్రాలు జతచేసి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో 21లోగా సమర్పించాలన్నారు.

ప్రాజెక్టు తెగింది... ఉపాధి ఆగింది

- రోడ్డున పడిన మత్స్యకారులు
- నాలుగు గ్రామాల్లో 50 కుటుంబాలు
- కొట్టుకుపోయిన రూ.50లక్షల సెరికల్చర్
- చేపలన్నీ కొట్టుకుపోయిన వైనం


ప్రాజెక్టులో సెరికల్చర్ (ఫైల్)

భైంసా/భైంసారూరల్: సిరాల ప్రాజెక్టు తెగడంతో మత్స్యకార కుటుంబాలు ఉపాధిని కోల్పోయాయి. 139 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ప్రాజెక్టు చుట్టుపక్కల పల్లెల్లో మత్స్యకార కుటుంబీకులకు జీవనాధారమైంది. నాలుగు తరాలుగా ఈ ప్రాజెక్టునే నమ్ముకుని జీవనం వెళ్లదీస్తున్నారు. తానూరు మండలం బోల్సా, బోసి, ఉమ్రి, భైంసా మండలం సిరాల గ్రామాల్లోని 50 కుటుంబాలు సిరాల ప్రాజెక్టుపైనే ఆధారపడి ఉపాధిని పొందుతున్నాయి. యేటా ప్రాజెక్టులో చేపలు పట్టడం, విక్రయించడంతోనే ఈ కుటుంబాలు జీవనాన్ని కొనసాగిస్తున్నాయి. ఏళ్లుగా ఈ ప్రాజెక్టు నిండుగానే ఉంది. ప్రాజెక్టు నిర్మించిన ప్పటి నుంచి నాలుగుసార్లు మాత్రమే ఎండిపోయింది. ఎప్పుడు నిండుకుండలా ఉండే ఈ ప్రాజెక్టు ఎంతోమంది మత్స్యకారులకు ఉపాధినిచ్చింది. అలాంటి ప్రాజెక్టుపై ఆధారపడిన మత్స్యకారులు ఉపాధిని కోల్పోయారు.

ఒక్కరాత్రిలో కొట్టుకుపోయింది...

సెరికల్చరర్ కోసం మత్స్యకార కుటుంబీకులు ఆరేళ్లుగా కష్టపడ్డారు. ఇప్పుడిప్పుడే పెట్టుబడులుచేతికి అందుతున్నాయి. ఇలాంటి తరుణంలో తాము గట్టెక్కిపోయామన్న ఆనంద పడుతున్న సమయంలోనే భారీ వర్షం కోలుకోని దెబ్బతీసింది. ఒక్కరోజు కురిసిన భారీ వర్షంతో సిరాల ప్రాజెక్టు గండిపడి కొట్టుకుపోయింది. ప్రాజెక్టు నీటిలో సెరికల్చరర్ కోసం ఏర్పాటు చేసిన సామగ్రి, పడవలు కొట్టుకుపోయాయి. వరద నీటిలో ఏడాదిగా పెంచుతున్న చేపలన్నీ కొట్టుకుపోయాయి. తెల్లారేసరికి నిండుగా కనిపించే సిరాల ప్రాజెక్టు బండరాళ్లతో వాగులాగా తయారైంది. ప్రధాన ఆయకట్టు తెగడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. మత్స్యకార కుటుంబీకులు జీవనోపాధి కోల్పోయారు.

తీవ్ర ఆవేదనలో...

పెంచుకున్నచేపలు పట్టుకునేలోపే భారీ వర్షానికి కొట్టుకుపోయాయి. ఏడాదంతా వారానికి రెండుసార్లు జాలర్లు వలవేసి చేపలు పట్టి విక్రయించే వారు. ప్రాజెక్టు వద్దే తాజా చేపలు అమ్ముడుపోయేవి. సిరాల ప్రాజెక్టులో మంచి చేపలు దొరుకుతాయని అందరు అక్కడికే వెళ్లేవారు. ప్రతివారం ఇక్కడే చేపలు విక్రయిస్తూ వచ్చిన ఆర్డర్లు తీసుకుని అందుకు తగ్గట్లుగా జాలర్లు చేపలను విక్రయించేవారు. ప్రాజెక్టు కొట్టుకుపోవడంతో ఈ కుటుంబాలు తీవ్ర నిరాశలోపడ్డాయి. ఈ కుటుంబాలన్ని ఉపాధిని కోల్పోయాయి.

రూ.50లక్షలతో సెరికల్చర్...

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత 50 కుటుంబాలు సొసైటీగా ఏర్పడ్డాయి. సిరాల ప్రాజెక్టునే ఆధారంగా తీసుకున్న ఈ కుటుంబాలు ప్రభుత్వానికి విన్నవించి ఇక్కడ సెరికల్చర్ ఏర్పాటు చేశాయి. ప్రాజెక్టులో రూ. 50లక్షలతో సెరికల్చర్ ప్రారంభించారు. ప్రాజెక్టు మధ్యలో చేపపిల్లల పెంపకం, వాటి కోసం ప్రత్యేక పడవల్లో వెళ్లి రోజువారి ఫీడింగ్ ఇవ్వడంలాంటి పనులుచేసేవారు. ఏడాదంతా పిల్లలను వదులుతూ పెరిగినకొద్ది చేపలను పట్టి విక్రయిస్తు ఉపాధి పొందారు. ప్రాజెక్టు మధ్యలో సెరికల్చరర్ ఉండేది. ప్రధాన తూము నుంచి ప్రాజెక్టు వరకూ రెండు పడవల్లో వెళ్లేవారు. యేటా ప్రభుత్వం ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేసేది. ప్రభుత్వం ఇచ్చే చేపపిల్లలను చెరువులోకి వదిలి వాటిని పెంచుకునేవారు.

ఉపాధి కోల్పోయాం



సిరాల ప్రాజెక్టుకు గండిపడడంతో మత్స్యకార కుటుంబాలన్ని రోడ్డునపడ్డాయి. మేమంతా తీవ్రంగా నష్టపోయాం. మమ్మల్ని ఆదుకోవాలని కోరుతున్నాం. ఎన్నోఏళ్లుగా మా కుటుంబాలు ఈ ప్రాజెక్టును నమ్ముకుని బతుకుతున్నాం. రూ.50లక్షలు ఖర్చుచేసి ఏర్పాటు చేసిన సెరికల్చర్ కనుమరుగైంది. కళ్లముందే ఇలాంటి పరిస్థితులు చూస్తామనుకోలేదు. ఏళ్లుగా కష్టపడ్డ కళ వరదనీటిలో కొట్టుకుపోయింది. ఏడాదంతా మా కుటుంబాలు ఏమిచేసి బతకాలో తెలియడం లేదు.

– దత్తు, మత్స్యకార సంఘం అధ్యక్షుడు

లోన్‌పేరుతో బంగారు గొలుసు కొట్టేశాడు


బాధితురాలు బోజబాయి, భర్త చిన్నన్న

కుభీర్: మండల కేంద్రానికి చెందిన మహిళకు గుర్తు తెలియని వ్యక్తి లోన్ వచ్చిందని మాయమాటలు చెప్పి రెండు తులాల బంగారు గొలుసు కాజేసిన ఘటన గురువారం మధ్యాహ్నం కుభీర్‌లో చోటుచేసుకుంది. బాధితురాలి వివరాల ప్రకారం... బోజబాయి బిందెతో నీళ్ల తీసుకుని ఇంటికి వెళ్తుండగా ఓ వ్యక్తి బైక్‌పై వచ్చి నీ పేరు బోజబాయా అని ఆరా తీశాడు. నీ కొడుకు పేరు గణేశా కదా అని అడిగాడు. బాధితురాలు అవును అని చెప్పింది. దీంతో సదరు వ్యక్తి ఆమెతో ఇంటికి వెళ్లి కూర్చుని మీకు రూ.50వేల లోన్ వచ్చిందని చెప్పాడు. బాధితురాలికి వికలాంగురాలైన కూతురు ఉండగా ఏదైనా లోను వచ్చిందనుకొని బోజబాయి నమ్మింది. వెంటనే జేబులో నుంచి డబ్బులు తీసి లెక్కపెట్టి రూ.35వేలే ఉన్నాయని, రూ.15వేలు తక్కువగా ఉన్నాయని, దక్కన్ బ్యాంక్ వద్దకు వస్తే మొత్తం డబ్బులు ఇస్తానని చెప్పాడు. అలాగే మెడలోని బంగారు గొలుసు తీసివేయాలని, లేకుంటే సార్లు నీవు ధనవంతురాలివి అనుకుంటారని చెప్పాడు. దీంతో బాధితురాలు బంగారు గొలుసు తీసి పక్షవాతంతో కాలు, చేతి పడిపోయి మంచంపై ఉన్న భర్త చిన్నన్నకు ఇచ్చి నడుచుకుంటూ బ్యాంక్ వద్దకు బయలుదేరింది. బ్యాంక్‌కు వెళ్లగా సదరు వ్యక్తి అక్కడ కనిపించలేదు. అతడు వారి ఇంటికి వచ్చి మీ భార్య గొలుసు ఇవ్వమందని చెప్పి గొలుసు తీసుకుని వెళ్లిపోయాడు. మోసపోయినట్లు భావించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపాడు.

శివాజీ బీడీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న


మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న

నర్సాపూర్(జి): శివాజీ బీడీ యాజమాన్యం బీడీ కార్మికులకు గత నెల రోజుల నుంచి పని కల్పించకుండా కార్మికుల జీవితాలతో చెలగాటమాడడం మానుకోవాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న హెచ్చరించారు. నర్సాపూర్ (జి) మండలంలోని రాంపూర్ గ్రామ శివాజీ బీడీ ఫ్యాక్టరీ ఎదుట తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జులై 8వ తేదీ నుంచి దాదాపు 300 మంది బీడీ కార్మికులకు పని కల్పించకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతూ ఆర్థికంగా నష్టపరుస్తున్నారని, వీరందరికీ వెంటనే పని కల్పించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. కారణం లేకుండానే కార్మికులకు పని బంద్ చేయడం అన్యాయమన్నారు. నాసిరకమైన తునికాకు సరఫరా చేస్తూ నాణ్యమైన బీడీలు తీసుకురావాలని ఇబ్బందులకు గురి చేయడం మానుకోవాలన్నారు. నెలకు 26 రోజుల పని కల్పించాలని బీడీ కార్మికులందరికీ పీఎఫ్, ఐడెంటిటీ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికుల శ్రమను దోచుకుంటూ యాజమాన్యాలు లాభాలు గడిస్తున్న కార్మికులకు మాత్రం నాణ్యమైన ఆకు సరఫరా చేయకపోవడం విడ్డూరంగా ఉందని, ఒక్కొక్క కార్మికురాలు నెలకు రూ.100 నుంచి 300 వరకు తునికాకు నష్టపోయి కంపెనీకి ఆకుకొని భర్తీ చేస్తూ కార్మికుల నిజ వేతనాలు కోల్పోతున్నారని మండిపడ్డారు. కార్మికులకు కమీషన్ దారులకు వెంటనే పని కల్పించాలని లేనిచో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం.బక్కన్న ఉపాధ్యక్షులు ఆర్. రామ లక్ష్మణ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.గంగన్న కోశాధికారి ఎండీ.గఫూర్, జిల్లా మహిళ నాయకులు లక్ష్మి, స్వరూప, సంఘవి, పోసాని, సువర్ణ, జయ, పావని పాల్గొన్నారు.

కడెం ప్రాజెక్టును సందర్శించిన సీఈ


వరద గేట్లను పరిశీలిస్తున్న సీఈ శ్రీనివాస్‌రెడ్డి

కడెం: కడెం ప్రాజెక్టును నీటిపారుదల శాఖ ఇన్‌చార్జీ సీఈ శ్రీనివాస్‌రెడ్డి గురువారం సందర్శించారు. వరద గేట్లు, స్పిల్‌వే, కౌంటర్ వెయిట్, జనరేటర్లను పరిశీలించారు. పూర్తిస్థాయి మరమ్మతుల గురించి ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్‌ఈ సుశీల్‌కుమార్, ఈఈ విఠల్, డీఈ భోజదాసు, ఏఈలు రవికుమార్, గణేశ్, విఠల్ తదితరులు ఉన్నారు.

రైతు బాగుంటే దేశం బాగుంటుంది



మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: రైతు బాగుంటే.. దేశం బాగుంటుందని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారుల గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి హాజరై మాట్లాడారు. రైతులందరూ సంఘటితంగా ఉండి ముందుకెళ్తే మంచి లాభాలు సాధించవచ్చన్నారు. ప్రతీ రైతు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేస్తే అధిక లాభాలు సాధించవచ్చన్నారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ పంటలను సాగు చేసుకోవాలన్నారు. గతంలో రైతులు విత్తనాలు, ఎరువుల కోసం ధర్నాలు చేసే వారని, ఇప్పుడు ఆ పరిస్థితి తెలంగాణలో లేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆయిల్‌పాం సాగుకు ప్రోత్సహిస్తుందని తెలిపారు. సోన్ మండలం పాక్‌పట్ల గ్రామంలో రూ. 300 కోట్లతో ఆ యిల్‌పాం ఫ్యాక్టరీ నిర్మిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు పాకల రాంచందర్, డాక్టర్ సుభాష్, రిలయన్స్ ఫౌండేషన్ సభ్యులు రమేష్, రాజేందర్ రెడ్డి, లక్ష్మణ్, సీఆర్డీ ప్రతినిధి రాజు, డ్రీమ్ కృష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్ పేరిట భారీ కుంభకోణం

- మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ పట్టణంలో కొత్త మాస్టర్ ప్లాన్ పేరిట అధికార పార్టీ నేతలు భారీ కుంభకోణానికి పాల్పడ్డారని బీజేపీ నేత మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మహేశ్వర్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రీన్ జోన్‌లో ఉన్న పంట పొలాలను ఇండస్ట్రియల్ జోన్‌లోకి మార్చి రైతులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఇండస్ట్రియల్ జోన్‌లోని సోఫినగర్ ప్రాంతాన్ని కమర్షియల్ రెసిడెన్షియల్ జోన్‌గా మార్చి అక్కడ అధికార పార్టీ నేతలు ముందు కొన్న భూముల విలువలు అమాంతం పెంచుకొని కార్పొరేట్ సంస్థలకు అమ్ముకొని కోట్లు గడిస్తూ నిర్మల్ పట్టణ ప్రజలను నిండా ముంచుతున్నారన్నారు. గతంలో ఇచ్చిన మాస్టర్ ప్లాన్‌కు పెద్ద ఎత్తున నిరసన జ్వాలలు వినిపించినా రైతులు, స్థానిక ప్రజలను మభ్యపెట్టి, స్థానిక మంత్రి ఆ మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేస్తున్నామని ప్రకటించి తిరిగి అదే తరహాలో మళ్లీ కొత్త మాస్టర్ ప్లాన్‌ను రూపొందించడం సరికాదన్నారు. కొత్త మాస్టర్ ప్లాన్‌తో రైతులు, స్థానిక ప్రజలకు తీవ్ర నష్టం కలుగుతుందని, వారి పక్షాన భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట మహాధర్నా చేపడుతామని తెలిపారు.

నేడు బీజేవైఎం ఆధ్వర్యంలో ధర్నా..

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట బీజేవైఎం ఆధ్వర్యంలో మహాధర్నా చేపడుతున్నట్లు బీజేపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అయ్యన్న గారి భూమయ్య, రావుల రాంనాథ్, మల్లికార్జున్‌రెడ్డి, సామ రాజేశ్వర్‌రెడ్డి, మెడిసెమ్మ రాజు, కమల్ నయన్, సాదం అరవింద్, భూపతిరెడ్డి, వొడిసెల అర్జున్, నాయుడి మురళి, గాదె విలాస్, శ్రీరామోజు నరేష్, ప్రజొత్‌రావ్, భారత్ పాల్గొన్నారు.

పంటలపై గడ్డిమందు పిచికారీ


పోట్‌పల్లి(ఎం)లో ఎండిపోయిన సోయాపంట


ఎండిపోయిన పత్తి పంట

లోకేశ్వరం: మండలంలోని పోట్‌పల్లి(ఎం) గ్రామానికి చెందిన మాదవ్ గంగన్న తనకున్న ఐదు ఎకరాల్లో ఖరీఫ్‌లో మూడెకరాల్లో సోయా, రెండు ఎకరాల్లో పత్తి పంటలను సాగు చేశాడు. గురువారం బాధితుడు గంగన్న తెలిపిన వివరాల ప్రకారం... ఖరీఫ్‌లో సాగు చేసిన సోయా, పత్తి అనుకున్నట్లుగానే ఏపుగా పెరిగి ఆశాజనకంగా ఉంది. బుధవారం ఉదయం ఎప్పటి మాదిరిగానే పంట చేనులోకి వెళ్లి చూసేసరికి పంటకు ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి మందు పిచికారీ చేశారని గుర్తించాడు. సోయా, పత్తి పంటలు గడ్డిమందు ప్రభావంతో పూర్తిగా ఎండిపోతున్నట్లు రైతు వాపోయాడు. ఏపుగా పెరిగిన పంటను చూసి దిగుబడులపై కొండంత ఆశ పెట్టుకోగా తనపై ఎవరో కక్ష గట్టిన దుండగులు పంటపై గడ్డిమందు పిచికారీ చేసి ధ్వంసం చేశారని బాధిత రైతు ఆవేదన వెలిబుచ్చాడు. బాధిత రైతు గంగన్న లోకేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న ఎస్సై సాయికుమార్ పంటలను పరిశీలించారు. పంటపై గడ్డి మందు పిచికారీ చేసిన గుర్తు తెలియని వ్యక్తులను త్వరలో పట్టుకుంటామన్నారు. నిందితులను వీలైనంత త్వరగా గుర్తించి కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామని ఎస్సై సాయికుమార్ ఈ సందర్భంగా వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు


క్షతగాత్రులు మర్సుకోల, సునీల్ దుద్‌బావునే

బేల: మండల కేంద్రంలోని పాత పెట్రోల్ పంపు వద్ద గురువారం సాయంత్రం జాతీయ రహదారిపై ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో డోప్టాల గ్రామానికి చెందిన పొచ్చన్నకు స్వల్ప గాయాలయ్యాయి. అలాగే మహారాష్ట్రలోని పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన గజానన్ మర్సుకోల్, సునీల్ దుద్‌బావునే లకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి ఏఎస్సై జీవన్, కానిస్టేబుల్ సలీం, సర్పంచ్ ఇంద్రశేఖర్ చేరుకుని రిమ్స్‌కు 108లో తరలించారు. ఇందులో గజానన్ మర్సుకోల పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్ర వాసి మృతి

భైంసారూరల్: అధిక మాసంలో సోదరి ఇంటికి వస్తున్న హన్మంతు గంగాధర్(44) జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మహారాష్ట్రలోని ఉమ్రి తాలుక మండల గ్రామానికి చెందిన హన్మంతు గంగాధర్ మేస్త్రీ పని చేస్తూ జీవిస్తున్నాడు. గురువారం భార్య అరుణతో కలిసి ద్విచక్రవాహనంపై భైంసాలో ఉండే తన చెల్లెలి ఇంటికి బయలుదేరాడు. గుజరాత్ నుంచి కరీంనగర్‌కు టైల్స్‌లోడ్‌తో వెళ్తున్న లారీ మండలంలోని పాంగ్రి గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనానికి వెనుకవైపు నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గంగాధర్ సంఘటనా స్థలంలోనే మృతిచెందగా భార్య అరుణకు గాయాలయ్యాయి. మృతుడికి ముగ్గురు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

మతిస్థిమితం లేని మహిళపై లైంగికదాడికి యత్నం

ఇచ్చోడ: మతిస్థిమితం లేని మహిళపై మద్యం మత్తులో ఒకరు లైంగికదాడికి యత్నించాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఎస్సై నరేశ్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అడేగామ (కే) గ్రామ సమీపంలోని బ్రిడ్జి వద్ద బుధవారం రాత్రి మతిస్థిమితం లేని మహిళ ఉంది. గుడిహత్నూర్ మండలం మన్నూర్ గ్రామానికి చెందిన షేక్‌నూర్ కిన్వట్ నుంచి ఇచ్చోడ వైపు బైక్‌పై వస్తున్నాడు. బ్రిడ్జి వద్ద మతిస్థిమితం లేని మహిళను గమనించి మద్యం మత్తులో ఆమెను చెట్ల పొదల్లోకి తీసుకువెళ్లి లైంగికదాడికి యత్నించాడు. గ్రామస్తులు గమనించి షేక్‌నూర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ మేరకు మహిళ బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

బాధితులను రక్షించేందుకు ఎయిర్ బోట్స్

- ఎస్పీ ప్రవీణ్‌కుమార్


ఎయిర్ బోట్స్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ ప్రవీణ్ కుమార్, డీఎస్పీ గంగారెడ్డి

నిర్మల్‌టౌన్: వరదల్లో చిక్కుకున్న బాధితులను సులువుగా రక్షించేందుకు ప్రభుత్వం ఎయిర్ బోట్స్ అందించిందని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ చెరువులో ఎయిర్ బోట్స్ శిక్షణ కార్యక్రమాన్ని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో భారీ వర్షాల కారణంగా కడెం, స్వర్ణ, గడ్డన్న ప్రాజెక్టులు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకున్నాయన్నారు. గ్రామాల్లోని చెరువులు, కుంటలు నిండుకుండలా మారాయని తెలిపారు. భారీ వర్షాలతో జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయినపుడు వరదల్లో చిక్కుకున్న వారిని కాపాడేందుకు జిల్లాలో ఎయిర్ బోట్స్, లైవ్ జాకెట్స్, ట్యూబ్స్, రోప్ తీసుకువచ్చామని వివరించారు. మొత్తం 70 లైవ్ జాకెట్స్, 25 ట్యూబ్స్, 2 బోట్స్, 100 మీటర్ల రోప్ బండల్స్ జిల్లాకు వచ్చాయని తెలిపారు. వీటికి సహకరించిన కలెక్టర్ వరుణ్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(ఏఆర్) వెంకటేశ్వర్లు, నిర్మల్ డీఎస్పీ గంగా రెడ్డి, పట్టణ సీఐ పురుషోత్తం, ఆర్ఐలు రమేశ్, రామకృష్ణ, ఎంపీవో వినోద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యువతిని అభినందించిన ఎస్పీ


రమను అభినందిస్తున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్

కడెం: ఎస్సైగా ఎంపికయిన మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన ముత్యాల రమను జిల్లా కేంద్రంలోని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ప్రవీణ్‌కుమార్ గురువారం అభినందించారు. మారుమూల ప్రాంతం నుంచి ఎస్సైగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. వివాహం, కుటుంబ బాధ్యతలు, ఇతర అడ్డంకులను అధిగమించి ఎస్సైగా ఎంపికైన రమ నేటి యువతకు ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

సోన్: ఏపీలోని గుంటూరు జిల్లా నుంచి బతుకుదెరువు కోసం బొప్పారం గ్రామానికి వచ్చిన సునీత(22) భర్త సురేష్‌తో కలిసి జీవిస్తోంది. కుటుంబ కలహాలతో సునీత గురువారం గోదావరిలో దూకేందుకు వంతెన వద్దకు వెళ్లింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. హెడ్‌కానిస్టేబుల్ ప్రతాప్ రెడ్డి, స్టేషన్‌రైటర్ భీమేశ్, హోంగార్డ్ ముత్యం వెళ్లి ఆమెను రక్షించి భర్తకు అప్పగించారు.

అర్లి వంతెనకు రూ.46 కోట్లతో ఆర్థికశాఖ అనుమతి


రాష్ట్ర ఆర్థిక శాఖ అనుమతులు లభించిన వంతెన

లోకేశ్వరం: మండలంలోని హవర్గ గ్రామ సమీపంలోని అర్లి వంతెన శిథిలావస్థకు చేరడంతోపాటు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముందు భాగం కూలిపోయింది. దీంతో రాకపోకలు నిలిపివేశారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వానికి ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి నివేదించారు. దీంతో రూ.46 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చిందని ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి తెలిపారు. త్వరలో టెండరు ప్రక్రియ పూర్తి చేసి నిర్మాణం ప్రారంభిస్తామని పేర్కొన్నారు.